# బైకుల స్టాండ్‌గా బస్టాండ్



బసంత్‌నగర్ బస్టాండ్‌లో నిలిపి ఉంచిన బైక్‌లు



రోడ్డుపై బస్సు కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో బస్సుల కోసం వేచి చూసే ప్రయాణికుల కోసం నిర్మించిన బస్టాండ్ ప్రస్తుతం బైకుల స్టాండ్‌గా మారింది. ఫోర్ లేన్ రహదారి నిర్మాణంలో భాగంగా బసంత్‌నగర్ స్టేజీ వద్ద రహదారికి ఇరువైపులా ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్‌లు నిర్మించారు. అయితే బస్టాండ్ రహదారి కంటే కొంచెం లోపలికి ఉండటంతో పాటు ఆర్టీసీ బస్సులు సైతం బస్టాండ్ ఎదురుగా కాకుండా ముందు స్థలంలో ఆపుతున్నారు. దీంతో ప్రయాణికులు బస్సులకోసం రోడ్డుపైనే వేచి చూస్తున్నారు. దీంతో బస్టాండ్ కాస్త బైకుల స్టాండ్‌గా మారింది. ధర్మారం క్రాస్‌రోడ్డు వద్ద అదే పరిస్థితి నెలకొంది. బస్టాండ్ ఒకచోట ఉంటే బస్సులు మరోచోట ఆపుతుండటంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. బస్సులను బస్టాండ్ వద్ద ఆపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



జూలపల్లి: మండలంలోని కోనరావుపేట గ్రామం మలుపు వద్ద రోడ్డు పక్కన వ్యవసాయ బావి ప్రమాదకరంగా ఉందని ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోకి వచ్చే రోడ్డు వద్ద మలుపు ఉండడంతో, దగ్గరగా వచ్చే వరకు బావి కనపడకపోవడంతో ఎప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు వెంటనే బావిని పూడ్చి వేయాలని స్థానికులు కోరుతున్నారు.

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

## క్లుప్తంగా

### లక్ష గోగు పువ్వులతో ప్రత్యేక పూజలు



సుల్తానాబాద్: మండల కేంద్రంలోని శివాలయం, సాంబశివాలయం, గుడి మిట్టపల్లి శివాలయం పూసాల శివాలయాల్లో ఆర్యవైశ్యులు, వ్యాపారులు, భక్తులు లక్ష గోగు పువ్వులతో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం మాఘ మాసం సందర్భంగా శివరాత్రి ముందు పూజలు, రుద్రాభిషేకం చేశారు. హాజరైన భక్తులకు పూజారులు మహేశ్, రమేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్లు సత్యనారాయణ, పల్ల మురళీధర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

### అంతర్గత మార్కుల కోసం పరిశీలన

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల అంతర్గత మార్కుల (ఫార్మేటివ్ అసెస్మెంట్) కోసం పరిశీలన చేసినట్లు ఎంఈవో రాజయ్య తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ, హైస్కూల్‌తో పాటు పలు ప్రైవేట్ ఉన్నత పాఠశాలల్లో అంతర్గత మార్కుల కోసం విద్యార్థుల రికార్డులను పరిశీలించారు. హెచ్ఎంలు రాధాస్వామి, శారద, దివాకర్, కవిత పాల్గొన్నారు.

### పారిశుద్ధ్య పనుల పరిశీలన

జూలపల్లి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పక్కాగా నిర్వహించాలని ఎంపీవో అనిల్‌రెడ్డి సూచించారు. మండలంలోని వడ్కాపూర్‌లో స్వచ్ఛ ఫ్రైడేలో భాగంగా మురుగు కాలువల శుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, తరలింపును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యదర్శి, కారోబార్, సిబ్బంది ఉన్నారు.

### కుక్కల బెడదను నియంత్రించండి

రామగిరి: గ్రామంలో వీధికుక్కల బెడద తీవ్రంగా ఉందని, తగు చర్యలు తీసుకోవాలని ముస్త్యాల గ్రామస్తులు కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీడీవో శైలజా రాణికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో కుక్కలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చిన్నారులు, వృద్ధులు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి నెలకొందన్నారు. ఒంటరిగా వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయని, గ్రామంలోని దూడలను, గేదెలపై కూడా దాడులు చేస్తున్నాయని వాపోయారు. గ్రామంలోని కుక్కల బెడదను నియంత్రించాలని ఎంపీడీవోను కోరారు. గ్రామస్తులు సుంకరి మహేశ్, నీలం శ్రీనివాస్, కంది శ్రీనివాస్, అనిల్, సందీప్, శేఖర్ పాల్గొన్నారు.

### న్యాయవాదుల విధుల బహిష్కరణ

సుల్తానాబాద్: రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లా న్యాయమూర్తిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ శుక్రవారం సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది విధులు బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పడాల శ్రీరాములు మాట్లాడుతూ న్యాయమూర్తులపై దాడి చేయడం హేయమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. భవిష్యత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందిపై దాడులు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక చట్టాలతో పాటు, న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని కోరారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోగుల రమేశ్ పాల్గొన్నారు.

### క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది



మెడల్స్ అందజేస్తున్న సురేశ్

యైటింక్లయిన్‌కాలనీ: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి కందెం సురేశ్ అన్నారు. యైటింక్లయిన్‌కాలనీ అబ్దుల్ కలాం స్టేడియంలో ధ్రువ పాండవ్ క్రికెట్ క్లబ్, తెలంగాణ జాగృతి వారు సంయుక్తంగా నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు శుక్రవారం కప్ బహూకరించారు. క్రికెట్ పోటీల్లో యైటింక్లయిన్‌కాలనీలోని ప్రభుత్వ, ప్రైవేట్, సింగరేణి పాఠశాలలకు చెందిన విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో సింగరేణి పాఠశాల క్రీడాకారుల టీం విజేతగా నిలిచింది. రన్నర్‌గా శాంతినికేతన్ పాఠశాల క్రీడాకారులు గెలుపొందారు. కాగా వారికి మెడల్స్‌తో పాటు బహుమతులు అందజేశారు. ధ్రువ పాండవ్ క్రికెట్ క్లబ్ చైర్మన్ కేవీ నరసింహారెడ్డి, శంకర్, సత్యం పాల్గొన్నారు.

## బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



మాట్లాడుతున్న నాయకులు

సుల్తానాబాద్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని కామారెడ్డి, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు వెంకట రమణారెడ్డి, పాల్వాయి శంకర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాస్థాయి జిల్లా అధ్యక్షులతో పాటు ముఖ్య కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యేలు మాట్లాడారు. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి, టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. 25మంది ఓటర్లకు ఒకరిని ఇన్‌చార్జిగా నియమించి పేర్కొన్నారు. గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలు రెండు కైవసం చేసుకునేలా ముందుకు వెళ్తున్నామని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి పోచం, మాజీ ఎమ్మెల్సీ ప్రభాకర్, పలు జిల్లాల నాయకులు శీలారపు పర్వతాలు, సమ్మయ్య, సదానందం, నాగరాజు, శంకర్, శ్రీనివాస్, క్రాంతి, సదయ్య, శ్రీనివాస్, ఎల్లంకి రాజు, కొల్లూరి కుమార్, మహేందర్ పాల్గొన్నారు.

## అమర జవాన్లకు కొవ్వొత్తుల నివాళి



ధర్మారంలో కొవ్వొత్తుల నివాళి



యైటింక్లయిన్‌కాలనీ: నివాళి అర్పిస్తున్న నాయకులు

ధర్మారం: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన వీర జవాన్లకు మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తలమక్కి రవీందర్‌శెట్టి ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ తన్నీరు రాజేందర్, జిల్లా కోఆర్డినేటర్ సామ ఎల్లారెడ్డి, కార్యదర్శి ఎండీ ముజాహిద్, ఇప్ప మల్లేశం, సభ్యులు చింతపండు నర్సింగం, మిట్ట రవి, ఈగం ప్రసాద్, కుంట రాజు, గుంట భాస్కర్, ఫ్రెండ్స్ యూత్ క్లబ్ అధ్యక్షుడు గుమ్మడి శివకృష్ణ, తిరుపతి, రాజేశ్, వంశీకృష్ణ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: పుల్వామా దాడిలో వీర మరణం పొందిన సైనికులకు యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తాలో విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. బజరంగ్‌దళ్ పట్టణ అధ్యక్షుడు తిరుపతి, విశ్వహిందూ పరిషత్ కాలనీ పట్టణ అధ్యక్షుడు దావు రాజిరెడ్డి, శివసాయి, శ్రావణ్‌కుమార్, అఖిల్, శశాంక్, నిఖిల్, సాయికుమార్, మహేశ్, సుధాకర్, వంశీ, చందు, రవితేజ, అనిల్ కుమార్, నవీన్, మణికంఠ, సాయిప్రసాద్ పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి



ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

సుల్తానాబాద్: పట్టభద్రులు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ జెడ్పీటీసీ ఉట్ల రమ కోరారు. శుక్రవారం సాయంత్రం మండల కేంద్రంలో గ్రాడ్యుయేట్స్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. నరేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, మాజీ సర్పంచ్ అంతటి పుష్పలత ఉన్నారు.

## సంక్షిప్త వార్తలు

**• నర్సరీ, పారిశుద్ధ్య పనుల పరిశీలన**

ఎలిగేడు: మండలంలోని లోకపేటలో ఎంపీవో అరిఫ్ పంచాయతీ కార్యదర్శితో కలిసి పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీ, సెగ్రిగేషన్ షెడ్, చేతి పంపులను పరిశీలించి తగు సూచనలు చేశారు.

**• నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

మంథని: మంథని విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ రాజేశ్ తెలిపారు.

**• విధులు బహిష్కరణ**

గోదావరిఖనిటౌన్: రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయమూర్తిపై దాడిని నిరసిస్తూ గోదావరిఖని న్యాయవాదులు శుక్రవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ న్యాయమూర్తిపై దుండగుడి దాడి హేయమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిందితుడిని చట్టం ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధులు తొటం సతీశ్, జవ్వాజి శ్రీనివాస్, రామటెంకి శ్రీనివాస్, శ్రీనివాస్, లింగస్వామి పాల్గొన్నారు.

**• గౌడ సంఘం అధ్యక్షుడి ఎన్నిక**

పాలకుర్తి: మండలంలోని ఈసాలతక్కళ్లపల్లి, కొత్తపల్లి, రామారావుపల్లి గ్రామాల గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా ఈసాలతక్కళ్లపల్లి గ్రామానికి చెందిన బైరి రాజేశంను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ శివారులోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గౌడ సంఘం సమావేశంలో కులస్తులంతా కలిసి రాజేశంను ఎన్నుకున్నారు. మాజీ సర్పంచ్ ముక్కెర శ్రీనివాస్, పడాల కొమురయ్య, బాలసాని మల్లేషం , గడ్డం వెంకటస్వామి పాల్గొన్నారు.

**• బల్దియాలో క్షయ నిర్ధారణ పరీక్షలు**

కోల్‌సిటీ: క్షయ నిర్మూలనలో భాగంగా రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నుంచి 15 రోజుల పాటు క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యాధికారి అన్నప్రసన్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ప్రత్యేక సూచనలతో ఎక్స్‌రే పోర్టబుల్ పరికరాన్ని ఏర్పాటు చేశామన్నారు. రామగుండం, గోదావరిఖని ఏరియా ప్రజలు వినియోగించుకొని క్షయ వ్యాధి నివారణకు తోడ్పాటు అందించాలని కోరారు.

**• ప్రజా వ్యతిరేక బడ్జెట్**

మంథని: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, ప్రజా వ్యతిరేకంగా ఉందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సీపెల్లి రవీందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్ అన్నారు. మంథనిలో శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాపెల్లి తిరుపతి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రసాద్, సాంబయ్య, శ్రీనివాస్, రఘునాథ్, రఘుపతి పాల్గొన్నారు.

**• యునానీ వైద్యసేవలు పునఃప్రారంభించాలి**

పాలకుర్తి: మండల పరిధిలోని పుట్నూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో యునానీ వైద్యసేవలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్తులు కోరారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయిసూర్యకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. వేల్పుల రాజ్‌కుమార్, తూడురి రాంబాబు, దుర్గం కుమార్, మునిగాళ్ల ప్రసాద్, బండారి సతీశ్ పాల్గొన్నారు.

**• చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ**

రామగిరి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆకుల వెంకన్న కోరారు. ఫిబ్రవరి 20న నిర్వహించే చలో హైదరాబాద్‌కు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. నాయకులు రాములు, చంద్రమౌళి, రవి, రాజునాయక్, లక్ష్మి, స్వప్న పాల్గొన్నారు.

**• చెత్త డబ్బాలు మాయం**

రామగుండం: పట్టణంలోని పోచమ్మ ఆలయ ప్రాంగణంలో కార్పొరేషన్ అధికారులు చెత్త సేకరణకు ప్రత్యేకంగా డబ్బాలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక స్టాండ్‌కు మూడు ప్లాస్టిక్ డబ్బాలు బిగించారు. మరుసటి రోజు గుర్తు తెలియని వ్యక్తులు అవి చోరీకి గురయ్యాయి. చెత్తడబ్బాలు చోరీకి గురవడంపై అధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**• ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం**

ముత్తారం: మండలంలోని పారుపల్లిలో శుక్రవారం ఎనుగూరి మల్లమ్మ అనే వృద్ధురాలి ఇంట్లో దేవుడికి ముట్టించిన దీపం ప్రమాదవశాత్తు అంటుకొని గుడిసె దగ్ధమైంది. ఈ ప్రమాదంలో రూ.7వేల నగదు, అర్ధతులం బంగారం, వంట సామగ్రి, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. ఇంటిలో ఒకేసారి మంటలు, పొగ గమనించిన స్థానికులు ఇంట్లో నుంచి వృద్ధురాలిని బయటకు తీసుకువచ్చారు.

### గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తాం

గోదావరిఖనిటౌన్: గ్రంథాలయాన్ని నూతన సాంకేతిక పరిజ్ఞానంతో మంత్రి, ఎమ్మెల్యేల సహకారంతో అన్ని వసతులతో అభివృద్ధి చేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సింగరేణి ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ అన్నారు. స్థానిక పవర్‌హౌస్‌కాలనీలోని గ్రంథాలయాన్ని శుక్రవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తక్షణం పాఠకులకు రీడింగ్ చైర్స్, ప్యాడ్స్, వేసవికాలం సందర్భంగా కూలర్స్ సమకూరుస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వారికి గ్రంథ పాలకులు భారతి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌పోస్ట్



చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో సురేశ్

రామగిరి: ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకే నూతన చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేశామని మంథని ఆర్డీవో సురేశ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని కల్వచర్ల గ్రామ శివారులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను శుక్రవారం ఆయన పరిశీలించారు. పోలీసు, రెవెన్యూ, మైనింగ్ సిబ్బంది సంయుక్తంగా చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ సుమన్, ఎస్సై చంద్రకుమార్ పాల్గొన్నారు.

### సింగిల్‌విండో పాలకవర్గానికి సన్మానం



సన్మానిస్తున్న శ్రీనుబాబు

మంథని: మంథని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పద వీకాలం ముగుస్తున్న తరుణంలో శుక్రవారం మంత్రి శ్రీధర్‌బాబు నివాసంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్ ఆధ్వర్యంలో పాలకవర్గ చైర్మన్, డైరెక్టర్లను మంత్రి సోదరుడు శ్రీనుబాబు సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండ్రు రమ, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ముస్కుల సురేందర్‌రెడ్డి, సంఘం డైరెక్టర్లు పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీశ్ కుమార్, సిరిమూర్తి ఓదెలు, గడ్డం పోచం, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు చొప్పరి సదానందం, కుడుదుల వెంకన్న, వొడ్నాల శ్రీనివాస్, అజీమ్‌ఖాన్, సురేశ్‌రెడ్డి, ఎరుకల ప్రవీణ్, బర్ల లింగయ్య, రాం రాజశేఖర్, కూర కోటేశ్, అనిల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నరేశ్, మంథని శ్రీనివాస్, పెంటరీ రాజు పాల్గొన్నారు.

**నేడు జిల్లాస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలు**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఈనెల 15న సబ్ జూనియర్ బాలబాలికల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి గుజ్జుల కరుణాకర్ రెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఉదయం ఆధార్‌కార్డుతో హాజరుకావాలని అన్నారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 20 నుంచి 23వరకు జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొంటారని తెలిపారు.

## ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

జ్యోతినగర్: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చిలుక శంకర్ డిమాండ్ చేశారు. ఎన్టీపీసీ రామగుండం ఆటోనగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14నెలలు పూర్తయినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమయ్యారని ఆరోపించారు. పేదలందరికీ ఇళ్లు మంజూరు చేయాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రైతు రుణమాఫీ రూ.2లక్షల వరకు చేస్తామని, మాఫీ చేయడంలో విఫలమయ్యారని విమర్శించారు. కల్యాణలక్ష్మి పథకానికి తులం బంగారం తుంగలో తొక్కారని ఎద్దేవా చేశారు. ఈనెల 20న చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నాయకులు బుచ్చన్న, కుమార్, స్వామి, రాయమల్లు, వెంకటస్వామి, రాజయ్య, శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి వార్తలు

### తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: రానున్న వేసవికాలం దృష్ట్యా సింగరేణి కాలనీల్లో నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్ ఆదేశించారు. మేడిపల్లి ఓసీపీ క్వారీ ప్రాంతాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. సింగరేణి కాలనీల్లో ఉడే ఉద్యోగులకు తాగునీటి సమస్య తలెత్తే అవకాశాలు ఉన్నందున మేడిపల్లి ఓసీపీ క్వారీ నుంచి నీటిని తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయప్రసాద్, సివిల్ ఎస్ఈ వరప్రసాద్, మేనేజర్ మల్లికార్జున్‌యాదవ్ ఉన్నారు.

### పెరిగిన వేజ్‌బోర్డు పెన్షన్ రిటైర్డ్ కార్మికులకు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోదావరిఖని: 11వ వేజ్‌బోర్డులో పెరిగిన పెన్షన్ రిటైర్డ్ సింగరేణి కార్మికులకు వెంటనే అమలు పరచాలని టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి కోరారు. ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్‌తో కలిసి శుక్రవారం సీఎంపీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించి అధికారికి వినతిపత్రం అందజేశారు. జూలై–2021లో సరైన కాలంలో వేజ్‌బోర్డు అమలు కాకపోవడంతో సుమారు 3వేల మంది రిటైర్డ్ కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. వెంటనే పెరిగిన పెన్షన్ అమలు పరచాలని, రావాల్సిన 44నెలల ఏరియర్స్ కూడా చెల్లించాలని కోరారు. కేంద్ర కమిటీ సంయుక్త కార్యదర్శి భేతి చంద్రయ్య, నరేశ్, శంకర్ పాల్గొన్నారు.

### నీటి ఎద్దడి సమస్యకు ప్రత్యేక కార్యాచరణ



పనులు పర్యవేక్షిస్తున్న అధికారులు

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ అధికారులు వేసవి కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని అమలు చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులు శుక్రవారం పర్యటించారు. ప్రధానంగా పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా లేని ప్రాంతాలపై దృష్టిసారించారు. 15వ ఆర్థిక సంఘం అన్‌టైడ్ గ్రాంట్స్ రూ.కోటి కేటాయించగా రూ.50లక్షల అంచనా వ్యయంతో పైప్‌లైన్ల నిర్మాణం, రూ.30లక్షల అంచనా వ్యయంతో లీకేజీల అరెస్ట్, రూ.20లక్షల అంచనా వ్యయంతో బోర్‌వెల్ మెటీరియల్ కొనుగోలు చేసి పాడైన బోర్లను ఉపయోగంలోకి తీసుకురావడం వంటి పనులు చేపడుతున్నారు. నగరంతో పాటు న్యూపీకే రామయ్యకాలనీ, సప్తగిరి కాలనీ తదితర ప్రాంతాల్లో పనులు చేపడుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు.

### ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బీజేపీతోనే సాధ్యం



డైరీ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌తో నాయకులు

గోదావరిఖని: కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతి పరులకు మద్దతు ఇస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, ప్రభుత్వాన్ని ప్రశ్నించడం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జాతీయ నాయకుడు అల్జాపురం శ్రీనివాస్ అన్నారు. స్థానిక మార్కండేయకాలనీలోని బీజేపీ కార్యాయలంలో శుక్రవారం జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన డైరీ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులగణన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను తక్కువగా చేసి చూపించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగ సమస్యలతో పాటు ప్రభుత్వాన్ని నిలదీయాలంటే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు కొమురయ్య, అంజిరెడ్డిని గెలిపించాలని కోరారు. రాష్ట్ర నాయకులు మెరుగు హనుమంతుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు జనగామ భూమయ్య, బోడకుంట సుభాష్, సురభి నవీన్, కొమ్మల ఆంజనేయులు, క్యాతం వెంకటరమణ, కోమల మహేశ్, మచ్చ విశ్వాస్, మాదరబోయిన రాకేశ్, జక్కుల ప్రవీణ్, బుంగ మహేశ్, పద్మ, అపర్ణ పాల్గొన్నారు.

### ఇసుక లారీలను నిలిపివేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న రాంచంద్రం

ముత్తారం: మండలంలోని ఖమ్మంపల్లి–తాడిచెర్ల మానేరు బ్లాక్ 1, 2 ఇసుక క్వారీల నుంచి లారీల ద్వారా ఇసుక అక్రమ రవాణా నిలిపివేయాలని శుక్రవారం రంగయ్యపల్లి ప్రధాన రోడ్డుపై కర్రె రాంచంద్రం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఇసుక రవాణాతో విపరీతమైన దుమ్ము, ధూళి ఇళ్లలోకి రావడంతో శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయని వాపోయారు. రెండురోజుల నుంచి ఇసుక లారీలను అడ్డుకున్నా పట్టించుకునే వారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేశారు.